# సర్వం జగన్నాధం!

"దీర్ఘాయుష్మాన్ భవ!"

ఉలిక్కిపడి తలెత్తి చూశాడు శర్మ.

ఎట్టెదుట సాక్షాత్తూ భగవంతుడే ప్రత్యక్షం కాలేదు కదా! భూమిని తాకుతోన్న కాషాయ వస్త్రాలతో, జడలు కట్టి వేలాడుతోన్న సుదీర్ఘ శిరోజాలతో, ఆశీర్వదిస్తోన్న అభయ హస్తంతో, మైమరుపు కల్గిస్తోన్న చిరునవ్వుతో, నిశ్చలంగా నిలబడివున్న సాధుపుంగవుడు!

అంతవరకూ ఆ కొండరాతి మీద ముణగ దీసుకుని కూర్చుని వున్న శర్మ సాధువుని విస్మయంగా చూస్తూ అచేతనంగా వుండిపోయాడు.

చుట్టూ నిర్మానుష్య ప్రదేశం. ఎత్తైన చెట్లు, బండల్లాంటి రాళ్ళు, ఏకాంతంగా వుంటుందని ఆ సాయంత్రం వేళ అంత దూరం వచ్చి కూర్చున్నాడు శర్మ. తన సంసార కష్టాల గురించి తలపోసుకుంటూ.

"బిడ్డా!" సాధు పుంగవుడు శర్మ మొహంకేసి తదేకంగా చూస్తూ అన్నాడు — "ఎందుకీ ప్రదేశంలో ఒంటరిగా వుంటివి నాయనా?"

ఇంకా అలాగే మోకాళ్ళని కావిలించుకుని కూర్చుని వున్న శర్మ కొంచెం సిగ్గుపడ్డాడు. మాట్లాడాలని నోరు తెరవబోయి మూసుకున్నాడు. లేచి నించోబోయి కాళ్ళు కదపలేకపోయాడు.

"ఏమి నాయనా, సుందరమైన నీ వదనంలో విచార రేఖలు?"

బావురుమనబోయాడు శర్మ. ఎంత చల్లని పలకరింపు! అణుచుకుని, గొంతు పెగుల్చుకుని నోరు విప్పాడు — "స్వామీ!"

"బిడ్డా!"

అప్రయత్నంగా చేతులు జోడించాడు శర్మ. "స్వామీ! తమరే నన్ను రక్షించాలి!" శర్మ కళ్ళల్లో ఆశా జ్యోతులు వెలిగాయి.

స్వామీజీ అతి సున్నితంగా చిరునవ్వు నవ్వాడు. "జీవులన్నిటినీ రక్షించగలిగేవాడు ఒక్కడే నాయనా! జగన్నాధుడు. సర్వం జగన్నాధం!"

కొండంత ధైర్యం వచ్చింది శర్మకి, ఈ స్వామి సామాన్యుడు కాడు. సాక్షాత్తూ భగవత్ స్వరూపుడే!

చటుక్కున లేచాడు శర్మ. ఆతృతగా రెండు చేతులూ దోసిలిపట్టి "అపరాధం మన్నించండి స్వామీ! తమరు నిలబడే వున్నారు. ఇలా ఆసీనులు కండి స్వామీ!" అంటూ చదునైన రాయి ఒకటి చూపించాడు.

"నించోవటం, కూర్చోవటం ఒక్కటే నాయనా! సర్వం మిధ్య! జగన్నాధుడొక్కడే సత్యం! హరివోం" అంటూ స్వామీజీ బండ రాతి మీద ఆసీనుడై జోలీ, కమండలం సరసనే వుంచుకున్నాడు. "నువ్వుకూడా ఇట్లా మా పాదాలచెంత కూర్చో నాయనా!"

క్షణంలో సగంసేపు సంశయించాడు శర్మ. నిజానికి, శర్మకి భగవంతుడంటే మహా విశ్వాసం. స్వార్ధ చింతన మరచి భగవంతుణ్ణి ధ్యానిస్తూ తిరిగే సాధు పుంగవులంటే గాఢాభిమానం!

స్వామీజీ కూర్చున్న రాతికి కొంచెం దిగువగానే కూర్చున్నాడు శర్మ.

"దీర్ఘాయుష్మాన్ భవ!" అంటూ స్వామీజీ జోలి విప్పి చిన్ని డబ్బా తెరిచాడు. చిటికెడు సింధూరం తీసి శర్మ నుదురికి అంటించాడు "జగన్నాధుని కుంకుమ దిద్దుకో నాయనా! నీకు క్షేమం కలుగుతుంది" అంటూ. తర్వాత "పురిసెడు మంత్రోదకం తాగు నాయనా!" స్వామీజీ కమండలం ఎత్తి పట్టుకున్నారు.

శర్మ సవినయంగా దోసిలిపట్టి మంత్రోదకం ఒక గుటకవేశాడు. గబగబా రుమాలుతో చేతులు తుడుచుకున్నాడు.

స్వామి, శర్మ మొహంలోకి అనునయంగా చూశారు. "సావధానంగా వినిపించు నాయనా నీ ఈతి బాధలు."

శర్మకి సిగ్గువేసింది. నిజం చెప్పాలంటే అంత దారుణమైన దీనగాధేం లేదతనికి. అందరూ బతుకుతున్నట్టే తనూ బతుకుతున్నాడు. సామాన్యమైన ఇబ్బందులే! ప్రతి ఇంటా వుండే సమస్యలే! మనస్సు మరీ అశాంతిగా వున్నప్పుడు ఇలాగే ఈ కొండలకేసి

వచ్చి కావలసినంతసేపు కూర్చుని ఇంటికి పోతూం టాడు.

"ఏమి నాయనా, అంత మౌనం?"

కంగారుగా అన్నాడు శర్మ — "అబ్బే, ఏమీ లేదు స్వామీ! మా వంటి వాళ్ళ సంసారిక బాధలు వినిపించి మీ నిశ్చలత్వాన్ని కలుషితం చేయవచ్చునా అని సంశయిస్తున్నాను స్వామీ!"

"అయ్యో! వెర్రి కుర్రా! మా నిశ్చలత్వం ఎంతటి విషమ స్థితిలోనైనా కలుషితం కాదురా బిడ్డా! పూర్వం మా వంటి సాధువునెన్నడైనా చూచి వున్నావా?"

"మన్నించాలి. చూశాను స్వామీ! నా చిన్నతనంలో మీ వంటి ఒక సాధువుగారు మా ఇంటికి భోజనానికి వచ్చారు. సరిగ్గా ఆయన భోజనం చేస్తోన్న సమయంలో ఒక సంఘటన జరిగింది. మా పక్క ఇంటిలో వుండే ఒక ఇల్లాలు చాలాకాలంగా తల నొప్పితో బాధపడుతోంది. ఎంత గొప్ప గొప్ప వైద్యాలకూ ఆవిడ తలనొప్పి కుదిరింది కాదు. అది మాకందరికీ తెలుసు. ఆవిడ భరించలేని బాధతో పసిపిల్లలా పెద్దగా ఏడుస్తూ వుండేది. క్రమంగా ఆవిడకు జీవితం మీద విరక్తి పుట్టింది. ఆ రోజు సరిగ్గా భోజనాల వేళ ఆవిడకు తలబాధ ఎక్కువై పిచ్చిదానిలా పెరట్లోకి పరుగెత్తి పోయి నూతిలో పడిపోయింది. ఆ ఘోరం మిగతా ఆడవాళ్ళ కళ్ళముందే జరిగిపోయింది. అంతా కలసి భయంతో కేకలు వేస్తోంటే, మా ఇంట్లో భోజనం చేస్తూ వున్న సాధువు చటుక్కున లేచి పెరట్లోకి పరిగెత్తారు. వెంటనే నూతిలోకి దూకేశారు. తర్వాత మిగతా వాళ్ళ సాయంతో ఆవిణ్ణి పైకి తీసుకు వచ్చి సంగతంతా తెలుసుకుని చాలా విచారించారు. ఆవిడకు స్పృహ లేకపోయినా చిటికెడు వీభూదితీసి బొట్టుపెట్టారు. అంతే! కొంత సేపటికి ఆవిడ నిద్ర లేచిన మనిషిలాగే కళ్ళు విప్పింది. చిరు నవ్వు నవ్వింది. ఆవిడ తలనొప్పి పూర్తిగా పోయింది. ఆ సంఘటన జరిగినప్పటి నుంచీ నాకు తమవంటి సాధుపుంగవులంటే ఎనలేని భక్తి స్వామీ!" — శర్మ స్వామీజీకి భక్తితో నమస్కారం చేశాడు.

స్వామీజీ చిరునవ్వు నవ్వాడు — "నీ ఆలోచన సక్రమంగా లేదురా బిడ్డా! ఆవిడ శిరోవేదనతో బాధ పడుతూ నూతిలోకి ఉరికింది. అవునా? అంత ఎత్తునుంచి అంత వేగంగా కిందికి పడటంలో ఆవిడ శిరస్సులోని నరాల వ్యవస్థ చక్కబడి వుండ వచ్చును. ఆ సాధుపుంగవుడి వీభూదిబొట్టు కేవలం నామ మాత్రం కావచ్చును."

విస్మయంగా చూశాడు శర్మ చాలా సేపు. "అలాగే జరిగిందంటారా స్వామీ?"

"వెర్రివాడా! ఆమాత్రపుటాలోచన అవసరంరా బిడ్డా! తెల్లనివన్నీ పాలూ నల్లనివన్నీ నీళ్ళూ కావురా!"

"స్వామీ!" — జ్ఞాననేత్రం తెరుచుకున్నంత సంభ్రమంగా, అప్రయత్నంగా అన్నాడు శర్మ. స్వామీజీపట్ల ప్రేమాను రాగాలు రెండింతలయ్యాయి — "స్వామీ! తమరు సామాన్యులుకారు! తమ గురించి తెలుసుకోవాలని ఆతృతగా వుంది స్వామీ!"

"ఇష్ట కామ్యార్థ సిద్ధిరస్తు! తప్పక వెల్లడి స్తాను. సావధానుడవై ఆలకించు! నేను పది సంవత్సరాలు హిమాలయాల్లో ఘోర తపస్సు చేసి ...."

కుతూహలంతో అడ్డం తగిలాడు శర్మ. "మన్నించండి స్వామీ! నాకు ఒక్క సందేహం! అది ముందు తీర్చండి" అనేసి జంకుతూ చూశాడు.

"అడగరా బిడ్డా!"

"తమరిలా సన్యాసి ధర్మం ఎందుకు స్వీకరించారు స్వామీ!"

పసిబిడ్డ ప్రశ్న విన్నంత తేలికగా నవ్వారు స్వామీజీ — "ఎంత బేలగా ప్రశ్నించావురా బిడ్డా! జగన్నాథుని చేర్చగలిగేది ఈ సన్యాసి ధర్మమే నాయనా! సంసార లంపటాలలో మునిగిన జీవికి అది దుస్సాధ్యం!"

శర్మకి ఎంతో దిగులు కల్గింది. అంత లోనే గుర్తు వచ్చినట్టు కొంచెం గట్టిగానే అన్నాడు — "అయితే స్వామీ! ఈ సన్యాసి ధర్మం స్వీకరించి మీరేం పొంద గలిగారు?"

అతిశయంగా నవ్వాడు స్వామీజీ — "చెప్పబోతూ వుండగా అడ్డుపడితివే! నేను పది సంవత్సరాలు ఘోర తపస్సు చేశాను. చివరి మూడు సంవత్సరాలూ వాయు భక్షణతో ఒంటి కాలిమీదనే నిశ్చలంగా తపస్సు చేశాను. చిట్టచివరికి ఒక శుభముహూర్తాన.... వింటు న్నావా నాయనా, జగన్నాథుని దర్శించే మహాభాగ్యం పొందగలిగాను."

తుళ్ళిపడ్డాడు శర్మ — "ఏమిటి స్వామీ? మీకు

భగవంతుడు కన్పించాడా?'' — విభ్రాంతితో కళ్ళు విప్పార్చి చూస్తూ మళ్ళీ అన్నాడు. “నిజంగానా స్వామీ? దేవుణ్ణి మీరు చూశారా? ఎలా వున్నాడు స్వామీ దేవుడు? ఏం బట్టలు కట్టుకున్నాడు?''

స్వామీజీ ముఖమండలంమీద కొంచెం విసుగుదల ప్రతిఫలించింది — “మూర్ఖుడా! నీతో అపహాస్యమా మాకు? ఆ జగన్నాధుడు శంఖుచక్ర గదాధారియై క్షణకాలం నా ఎట్టెదుట ప్రత్యక్షమై చిద్విలాసంచిందించి అంతర్ధానమయ్యాడు. ఉన్న నిజం చెప్తే విశ్వసించని నీవంటి అమాయకుల నెందరినో చూసిన పిదప .... నేనా సంగతి చెప్పడమే మానుకున్నాను.''

“మన్నించండి స్వామీ! ఆశ్చర్యం పట్ట లేక అలా అడిగాను.'' ఒక్కక్షణం ఊరుకున్నాడు శర్మ — ఉన్నట్టుండి మళ్ళీ అన్నాడు. “భగవంతుణ్ణి చూడగలిగిన మీరు ఎంత అదృష్టవంతులు స్వామీ!''

స్వామీజీ శాంతించాడు — “నిజం నాయనా! దశవర్ష దీర్ఘకాల నిరీక్షణానంతరం ఆ మహాభాగ్యం కల్గింది. సాక్షాత్తూ శ్రీమన్నారాయణ స్వరూపాన్ని కనులారా దర్శించగలిగాను'' స్వామీజీ తన్మయత్వంతో కన్నులు మూసుకున్నాడు.

“స్వామీ! భగవంతుణ్ణి మీరేమి వరాలు అడిగారు?'' అన్నాడు శర్మ ఎలాగో ధైర్యం తెచ్చుకుని.

స్వామి కన్నులు విప్పార్చుతూ అన్నాడు “నేను స్వప్రయోజనార్థినై తపస్సు చేయ లేదు నాయనా! కేవలం భగవత్ స్వరూపాన్ని వీక్షించటానికే చేశామ. జగన్నాధుడు ప్రత్యక్షమవగానే కంఠమెత్తి తన్మయుడనై దైవలీలలను శ్లాఘించాను. భగవంతుడు ఆశీర్వదించి అంతర్థానమయ్యాడు. వరాలు నేను అడగనూ లేదు, ఆయన ఇవ్వనూ లేదు.''

“అయ్యో! దేవుడు కనపడితే వరాలు అడగనే లేదా? ఎంత మంచి అవకాశం పోయింది!'' అనిపించింది శర్మకి.

“మీ జన్మ తరించింది స్వామీ!'' అప్రయత్నంగానే అనేశాడు పైకి.

“మీ వంటి త్యాగధనులకు తప్ప నా వంటి దౌర్భాగ్యుల కా భగవద్దర్శనం కలలో నైనా కల్గుతుందా!''

“విచారించకు బిడ్డా! భగవంతుని కన్నులారా గాంచిన నా వంటి తపోధనులు ఉండనే వున్నారు. మా ద్వారా నీ వంటివారు తృప్తి చెందవచ్చును. అందరూ తపస్సులు చెయ్యలేరు నాయనా!''

“నిజమే స్వామీ! అది నా వంటి వాళ్ళ వల్ల అవుతుందా? నా మీద దయవుంచి నాకేదైనా జ్ఞాన బోధ చెయ్యండి స్వామీ! నా సంసార గాధ కరుణతో ఆలకించండి స్వామీ!''

“వెర్రి తండ్రివిలా వుంటివే! మొదటే చెప్పమని అడిగితిని కదా!'' స్వామీజీ సుదీర్ఘమైన గడ్డాన్ని నిమురుకుంటూ కూర్చున్నాడు.

స్వామీజీ ఎలా మాట్లాడినా శర్మకి సంతోషమే కల్గింది. “నేనొక గుమాస్తాని! వినండి స్వామీ! ఎంత చాకిరీ చేసినా అదే జీతం! అదే సీటు. అదే ఉద్యోగం. పైఅధికారులకు కాకాలుపట్టి తిరగటం నా తత్వానికి విరుద్ధం. ఇదీ ఆఫీసు విషయం. ఇక ఇంట్లో సంగతి. వయస్సు మళ్ళిన తల్లిదండ్రులు. ఈడేరి ఇంటవున్న ఆడబడుచు, పెద్ద చదువులకోసం ఆశపడుతున్న సోదరుడు. నన్ను నమ్ముకుని వచ్చిన అర్ధాంగి. ఆవిడ ప్రసాదించిన ఇద్దరు చిరంజీవులు!''

“శివశివా!'' చెవులు మూసుకున్నాడు స్వామీజీ. “ఎన్ని ఝంజాటాలలో చిక్కి వుంటివో నాయనా?''

బిత్తరపోయాడు శర్మ.

“వినిపించు నాయనా! ఆపితివేమి?''

“తమరు .... చెవులు మూసుకున్నారు స్వామీ!''

“అయ్యో! వెర్రివాడా! చెవులు మూసుకున్నా వినగలనురా!''

విస్మయంగా చూసి దిగులుగా అన్నాడు శర్మ. “ఇంతకన్నా ఏం విన్పించమంటారు స్వామీ? నెల తిరిగేసరికి నాకు అందేది ఒక్క వంద రూపాయలే! ఒక్కపూట తిని ఒక్క బట్ట కట్టినా ఖర్చయ్యేది రెండు వందల పైచిలుకు. మిగతా వంద నెలనెలా అప్పు. మార్వాడీ దగ్గిర నోట్లు, తాకట్లు.''

దీర్ఘంగా నిట్టూర్చారు స్వామీజీ — “చెప్పు'' అన్నట్టు తల వూపుతూ.

“మొన్న చెల్లెలికో సంబంధం వచ్చింది. నాల్గువేల కట్నం అడిగారు. కట్నాలిచ్చి పెళ్ళి చెయ్యటం నాకిష్టం లేదు స్వామీ! తమ్ముడు తెలివిగా పరీక్షలు పాసౌతున్నాడు. ఇంకా చదివించాలనే వుంది స్వామీ!

నాన్నగారి ఆరోగ్యం క్షీణిస్తోంది. మంచి మంచి మందులు వాడలేకపోతున్నాను. అమ్మకి చత్వారం ముదిరింది. కళ్ళద్దాలు కొనమంటోంది. సరస్వతికి, అంటే నా భార్యే స్వామీ, .... ఈమధ్య హిస్టీరియా వస్తోంది. ఇక నిత్యం పిల్లలకు అనేక అవసరాలు, మధ్యాహ్నం ఇల్లు బయల్దేరుతోంటే పెద్ద వాడు జోళ్ళు తెమ్మని చెప్పాడు. తర్వాత వాడికి పలక, చంటిదానికి బిస్కట్లు, బుల్లి వాడికి పాలడబ్బా."

"హరేరాం!" ఆకాశంలోకి దృష్టి సారించారు స్వామీజీ. స్వామీజీతో పాటు అనంతాకాశంలోకి చూశాడు శర్మకూడా.

కొన్ని నిముషాలు నిశ్శబ్దం!

"బిడ్డా! సన్యాసి ధర్మం స్వీకరించగలవా?"

తుళ్ళిపడ్డాడు శర్మ, "స్వామీ! నన్నేనా?"

స్వామీజీ మౌనం వహించారు.

శర్మ చేతులు నలుపుకుంటూ అన్నాడు. "నిజంగా మిమ్మల్ని చూస్తోంటే నాకెంతో అసూయగా వుంది స్వామీ! ఏ ఆకో అలమో తిని ఉదరపోషణ చేసు కుంటారు. ఏ చెట్టు నీడనో విశ్రమించి కాలం దొర్లి స్తారు. మీకు బాధ్యతలు లేవు. సమస్యలు లేవు. హాయిగా ఎగిరే పక్షికీ మీకూ భేదం లేదు స్వామీ! కానీ, మహాదౌర్భాగ్యుణ్ణి నేను. సంసార సాగరంలో పూర్తిగా మునిగివున్నాను నా నెత్తిమీద భరించలేని బాధ్యతలు న్నాయి. నా జీవితం నిండా పరిష్కరించలేని సమస్య లున్నాయి. నేను సన్యాసుల్లో కలిసిపోయానని వింటే మా అమ్మ కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చి, ఉన్న చూపు కూడా పోగొట్టుకుంటుంది. సరస్వతి విరుచుకు పడి శాశ్వతంగా బిగుసుకు పోతుంది. బిడ్డలందరూ అనాథలైపోతారు. అంతంతమాత్రంగా నడిచే సంసార నావ తల్లకిందులైపోతుంది."

"శాంతించు నాయనా! నీ జీవిత ధ్యేయాన్ని నువ్వు గ్రహించుకున్నావు. ధైర్యంతో సంసార సాగరాన్ని ఈదటానికే ప్రయత్నించు!"

"ప్రయత్నిస్తూనే వున్నాను స్వామీ! నా శక్తి చాలటంలేదు. ఏ క్షణంలో మునిగి పోతానో అర్థం కాకుండా వుంది."

స్వామీజీ చిరునవ్వు నవ్వారు. "చింతించకు! నువ్వు చాలా పెద్ద పొరపాటు ఒకటి చేస్తున్నావు."

"ఏమిటి స్వామీ? శెలవీయండి" ఆతృతగా చూశాడు శర్మ.

"బ్రతకటం నేర్చుకో నాయనా? కాలా నికి ఎదురు తిరిగి, ప్రవాహానికి ఎదురీది, నెగ్గలేవు. డబ్బు సంపాదించే మార్గాలు వెతుక్కో! అన్ని సమస్యలూ గట్టెక్కుతాయి."

శర్మ అయోమయంగా చూశాడు. "జీతం కన్నా ఇంకా ఎక్కువ డబ్బు ఎలా సంపాదించగలను స్వామీ?"

"అది నేనెలా చెప్పగలను బిడ్డా? ఆలోచించి ఇంకేదైనా మార్గం ఎంచుకో! తప్పు లేదు."

"మన్నించండి స్వామీ! తమరి ఉప దేశం నేను అర్థం చేసుకోలేకపోతున్నాను."

స్వామీజీ తీక్షణంగా చూశాడు.

శర్మ తలదించుకున్నాడు.

ప్రసంగం మార్చుతూ అన్నాడు స్వామీజీ "నీ దగ్గర బీడీవుంటే చూడు నాయనా!"

తెల్లబోయాడు శర్మ. "మీరు .... బీడీలు కాలు స్తారా స్వామీ?"

"సర్వం భగవదర్పితం. మధ్య నేను నామ మాత్రుడిని."

"మీ నియమాలకు భంగం కాదా స్వామీ?"

"నియమాలు ఆత్మకేగానీ దేహానికి కాదు నాయనా!"

"మన్నించండి స్వామీ! నేను బీడీలు కాల్చను. సిగరెట్టు స్వీకరిస్తారా?"

"ఏదైనా ఒకటే నాయనా! సర్వం జగన్నాథం!"

శర్మ పేంటు జేబులోంచి సిగరెట్టుపెట్టె తీసి స్వామీజీకి అందించాడు. స్వహస్తాలతో అగ్గిపుల్లగీసి అంటించాడు.

స్వామీజీ గడ్డాల మీసాలమధ్య తెల్లటి సిగరెట్టు నిలబడి వెలుగుతోంటే కుతూహలంగా చూశాడు శర్మ.

"స్వామీ! తమ నివాసమెక్కడ?"

"గాలికి నివాసమేమిటి నాయనా? ఏ పూటకి ఎక్కడ గడిచిపోతే అక్కడ."

"ఈ దిక్కుగా మీరెందుకు బయల్దేరారు?"

"ఈ ఊరు నాకు కొత్తే. దేవాలయం దగ్గిర ఉత్స వాలు జరుగుతాయని విని ...."

"నిజమే స్వామీ! వరసగా నాలుగైదు రోజులు జరుగుతాయి. ఇవ్వాళే ప్రారంభం. స్వామీ! తమకు అభ్యంతరం లేకపోతే నేను తమ పాదసేవ చేసుకుంటాను. అదిగో, అక్కడ నా సైకిలు తాళంవేసి వదిలి వచ్చాను. మిమ్మల్ని జాగ్రత్తగా దేవాలయం ముందు దిగవిడుస్తాను."

"నువ్వింత కుతూహలపడుతోంటే తప్పుతుందా? నీ ఇష్టప్రకారమే జరుగుతుంది. ఇక ఆలశ్యం చేయకు, పద!"

స్వామీజీ గబగబా కొండ దిగాడు. శర్మ పరుగెత్తుతూ స్వామీజీని అనుసరించాడు.

"మీ సంచి సైకిల్ ముందు తగిలిస్తాను స్వామీ!"

"ఒద్దు, ఒద్దు. నేనిలాగే ఒడిలో పెట్టుకుంటాను."

జోలీ, దండ కమండలాలూ అన్నీ వడిలో సర్దుకుని సైకిల్ వెనక కూర్చున్నాడు స్వామీజీ. జనంలోంచి వీధి వెంట సైకిల్ తొక్కుతోంటే శర్మకి కాస్త సిగ్గుగానూ, కాస్త గర్వంగానూ కూడా అనిపించింది. స్వామీజీతో ఇంకా చాలా మాట్లాడాలి. తన సమస్యలకు ఆయనే పరిష్కారాలు చూపించగలడు.

శర్మ సైకిల్ ఆపుజేశాడు హోటల్ ముందు. "స్వామీ! కాసిన్ని వేడివేడి పాలు స్వీకరించాలి. ఒక్క క్షణం మీరిక్కడ నిలబడి వుంటే నేనిప్పుడే పాలు తీసుకు వస్తాను."

"ఎందుకురా బిడ్డా నీకంత శ్రమ? పద, నేనూ నీ వెనక వస్తాను."

"మీరు .... హోటల్లోకి వస్తారా? వద్దు స్వామీ! మీ వంటివారికా ప్రదేశం బాగుండదు స్వామీ!"

"సర్వం జగన్నాథం! అంతా వాడి సృష్టి విలాసమే. దేనినీ మనం ద్వేషించి విసర్జించకూడదు నాయనా! అది భగవంతుడి సృష్టి విలాసాన్ని కించపర్చటమే."

ఆశ్చర్యంగానే అన్నాడు శర్మ. "స్వామీ మీది ఎంత సమగ్రమైన ఆలోచన!"

"అవును నాయనా! కలుషితం ఏ వస్తువులోనూ లేదు. దాన్ని వినియోగించుకునే తత్వంలో వుంది."

"ఆహా! ఎంత బాగా చెప్పారు! అయితే, దయ చేయండి స్వామీ!"

స్వామీజీ హుందాగా నడిచాడు ఊటీ హోటల్ లోపలికి. శర్మ వినమ్రతతో అనుసరించాడు.

హోటల్లో క్షుదార్తులంతా తలలు తిప్పి స్వామీజీని దర్శించి నవ్వు మొహాలు తెచ్చుకున్నారు.

"అలా చివరికి వెళ్ళి కూర్చుందాం నాయనా!"

"నడవండి స్వామీ!"

స్వామీజీ వెళ్ళి వెళ్ళి బాగా వెనక టేబుల్ దగ్గిర కూర్చున్నాడు "హరిహోం" అంటూ.

శర్మ ఇటూ అటూ చూసి తనూ ఒక కుర్చీ జరుపుకుని కూర్చున్నాడు — "స్వామీ! పొరపాటు చేశాను. కాసిన్ని అరటి పళ్ళు కొని తెస్తే తమరు పాలతోపాటు పళ్ళుకూడా స్వీకరించవచ్చును గదా? వెళ్ళి వస్తాను" అంటూ లేవబోయాడు.

"ప్రస్తుతానికి వద్దు నాయనా! బైటికి వెళ్ళిన తర్వాత నీ తృప్తిమేరకు సమర్పించ వచ్చును. ఏ క్షణానికి ఏది అందితే దానినే స్వీకరించటం మాకు సంతోషం."

"మీకు అభ్యంతరం లేకపోతే కొంచెం అల్పాహారం కూడా చెయ్యండి స్వామీ! ఇడ్లీ భుజించండి, తప్పులేదు."

"తప్పు ఒప్పుల ప్రసక్తేలేదని నేను చెప్పివుంటిని కదా? కంగారు పడకు. నీకు తృప్తి కలిగే వరకూ నేను భుజించి లేస్తాను. వేడిగా ఏమేమి వున్నాయో అడుగు నాయనా!"

అంతలోకే సర్వర్ హాజరు పలికాడు.

"వేడిగా ఏం వున్నాయోయ్?"

"ఇడ్లీ — దోసె — పూరీ — బజ్జీ — ఉప్మా — వడ — అన్నీ వేడిగానే వున్నాయి సార్!"

"స్వామీ! తమరేం ఆరగిస్తారు?"

"ఏదైనా ఒకటే నాయనా! సర్వం జగన్నాథం! పెసరట్టు లేదటయ్యా?"

"కొంచెం ఆలశ్యమౌతుంది సార్!"

స్వామీజీ అన్నాడు — "రవ్వదోసె, బజ్జీ, పూరీ చాలు మాకు."

శర్మ సర్వర్‌కేసి చూశాడు. "స్వామీజీ చెప్పారు కదా? తొందరగా తేవోయ్!"

"నువ్వేమీ తీసుకోవా నాయనా?"

"అవసరం లేదు స్వామీ! కొంచెం కాఫీ తాగుతాను."

"శివోహం"

సర్వర్ ట్రేలో ప్లేట్లన్నీ బల్లనిండా పేర్చిపెట్టాడు.

స్వామీజీ మొహమాట పడతాడేమోనన్న శంకకొద్దీ శర్మ మళ్ళీ హెచ్చరించాడు. "తీసుకోండి స్వామీ! ఆరగించండి!"

"అలాగే నాయనా! హరిఓం" అంటూ స్వామీజీ దోసెప్లేటు దగ్గిరికి తీసుకున్నాడు. "కొబ్బరి చెట్నీ రుచి తగలబడింది నాయనా!"

వింతగా చూశాడు శర్మ. మళ్ళీ దృష్టి మిగతా జనం మీదికి మళ్ళించి కాలక్షేపంగా చూస్తూ కూర్చున్నాడు. టేబుళ్ళన్నీ రద్దీగా వున్నాయి. జనం అవురావురుమంటూ తింటున్నారు.

సర్వర్ మళ్ళీ వచ్చాడు.

"ఓ కప్పు పాలూ, ఓ కప్పు కాఫీ ...." ఆర్డర్ చేయబోయాడు.

స్వామీజీ అడ్డుతగిలారు. "శిరస్సు వేదనగా వుంది. ఒక కప్పు చిక్కని చాయ్ తెప్పించు మాకు. పాలు వద్దు."

"అలాగే స్వామీ! — ఓ చాయ్! ఓ కాఫీ!"

సర్వర్ వెళ్ళి పోయాడు. చాయ్‌తో వచ్చాడు.

స్వామీజీ చాయ్ తాగుతూ చిరునవ్వు చిందించాడు — "నీ సంతృప్తి కోసమే ఇవన్నీ స్వీకరించాను నాయనా!"

"నాకు చాలా సంతోషంగా వుంది స్వామీ" కప్పు కిందపెట్టి లేచాడు శర్మ. "కూర్చుని వుండండి. నేను తాంబూలం తీసుకు వస్తాను. తిన్నగా వెళ్ళిపోదాం."

"చూడు నాయనా! దంతాలు కొంచెం బాధపెడుతున్నాయి. తాంబూలంలో ఒక్క రవ్వ మసాలా అంటించమని చెప్పు నాయనా!"

"రెండు ఆస్ప్రిన్ మాత్రలు వేసుకుంటారా స్వామీ! తలనొప్పి కూడా తగ్గుతుంది."

"అవసరం లేదు. అవసరం లేదు. మసాలామాట మరువకు. సరిపోతుంది."

శర్మ పాన్‌షాప్ దగ్గిరికి వెళ్ళాడు.

ఐదు నిముషాలు గడిచింది.

"శివోహం! శివోహం!" అంటూ కూర్చుని వున్నాడు స్వామీజీ.

నలుగురైదుగురు భక్తులు దగ్గిరికి జేరారు.

ముందు టేబుల్ దగ్గిరి నుంచి లేచి వచ్చిన ఒక వ్యక్తి సూటిగా స్వామీజీ కళ్ళల్లోకి చూడబోయాడు.

స్వామీజీ అరమోడ్పు కన్నులతో గడ్డం నిమురుకో సాగాడు.

"స్వామీ!"

"బిడ్డా!"

"కుశలమా?"

"జగన్నాథుని కృప!"

శర్మ తిరిగి వచ్చాడు. తాంబూలం స్వామీజీకి అందించాడు.

కొత్త వ్యక్తి స్వామీజీకి శర్మని చూపిస్తూ — "ఈయన మీ నూతన శిష్యులా స్వామీ?" అని అడిగాడు.

"ఎవరికెవరు ఏమీకారు నాయనా! సర్వం మిథ్య! జగన్నాథుడే సత్యం!"

"బొత్తిగా ఈ మధ్య తమ దర్శనాలే లేవు స్వామీ!" — కొత్త వ్యక్తి!

"పాపాత్ములు మమ్ము చూడలేరు నాయనా!"

ఆ వ్యక్తి ఎర్రగా చూశాడు. "పుణ్యం సంపాదించటానికి ప్రయత్నిస్తాం స్వామీ! మా గృహాన్ని పావనం చేయరా?"

"నిరీక్షించు నాయనా! నిరీక్షించు!"

శర్మ కేమీ అర్థం కాలేదు. "ఏమిటి మాష్టారూ?" అన్నాడు కంగారుగా ఆ వ్యక్తితో.

"మీ స్వామీజీనే అడగండి. సర్వజ్ఞులు. ఈసరికి దివ్యదృష్టితో గ్రహించే వుంటారు."

శర్మ, స్వామీజీని చూస్తూ అడిగాడు. "స్వామీ! మీరైనా శెలవీయండి."

"సర్వం జగన్నాథం! నీ ఆతృతకి కారణ మేమీ లేదు. పద నాయనా వెళ్దాం, నాకు పూజవేళ దాటిపోతోంది."

స్వామీజీ లేచి నించున్నాడు. జోలీ కమండలం సర్దుకున్నాడు.

కొత్త వ్యక్తి జబర్దస్తీగా స్వామీజీ భుజాల మీద చేతులువేసి మళ్ళీ కూలవేశాడు. "స్ట్రాంగ్ చాయ్ తాగి ఖారాకిళ్ళీ బిగించారు. ఇప్పుడు పూజ ఏంటి స్వామీ?"

శర్మకి ఆ వ్యక్తి ధోరణికి చాలా కోపం వచ్చింది. "మాష్టారూ! స్వామీజీతో అలా ప్రవర్తిస్తున్నారేవిటి?"

"డోంట్‌వర్రీ! మీరలా చోద్యం చూస్తూండండి

బ్రదర్!" అన్నాడు నవ్వుతూ కొత్త వ్యక్తి. ఆ మాటలతో ఇంకా కొంతమంది అక్కడ కూడారు.

"అయితే స్వామీ! ప్రస్తుతం తమరు నిషాలో లేరుగా!"

"బిడ్డా! ప్రపంచమే ఓ నిషా! అది తెలుసుకో!"

"నిజమే స్వామీ! తెలుసుకున్నాను. జగన్నాథుడు మిమ్మల్ని శిష్యుడిగా స్వీకరించాడా?"

శర్మకి చిర్రెత్తుకొచ్చింది. "మీరంత తేలికగా మాట్లాడకండి సార్! స్వామీజీ ప్రత్యక్షంగా జగన్నాథుణ్ణి దర్శించారు. పది సంవత్సరాలు ఘోర తపస్సు చేసి భగవంతుణ్ణి చూశారు."

"బాప్‌రే స్వామీజీ!" అంటూ పగలబడి నవ్వటం ప్రారంభించాడా వ్యక్తి.

శర్మ విసురుగా స్వామీజీతో అన్నాడు — "స్వామీ! మీరెందుకింత శాంతంగా వూరుకుంటున్నారు?"

"సహనం నాయనా! సహనం! తన భక్తుడికి అవమానం జరుగుతోంటే కోపగించవలసింది భగవంతుడే. సర్వవేళలా జగన్నాథుడు ఈ భక్తుణ్ణి పరీక్షిస్తూనే వుంటాడు."

హోటలు ముందు పోలీస్ జీప్ వచ్చి ఆగింది. ఇద్దరు కానిస్టేబుల్స్ దిగి లోపలికి వచ్చి కొత్త వ్యక్తికి శాల్యూట్ చేసి చోద్యం చూస్తూ నించున్నారు.

ఆ కొత్త వ్యక్తి సి.ఐ.డి. ఇన్‌స్పెక్టరని అప్పటికి అర్థమైంది జనానికి.

శర్మ కంగారుపడ్డాడు. "ఏమిటండీ మాష్టారూ? స్వామీజీ ఏం చేశారు?"

ఇన్‌స్పెక్టరు స్వామీజీకేసి రెండడుగులు వేసి "స్వామీజీ! మీ జోలిలో మాకేమైనా కొంచెం ప్రసాదం దొరుకుతుందేమో వెతుక్కోనివ్వండి?" అంటూ జోలి వూడలాక్కుని నేలమీద దిమ్మరించాడు. చిన్న చిన్నవి రెండు సారా సీసాలూ, బీడీల కట్టా, వెంట్రుకల కుచ్చులూ, గుప్పెడు మందు పొట్లాలూ, కరక్కాయలూ, చిన్న సెంటు సీసా, సబ్బుముక్కా!

శర్మ వెర్రివాడిలాగ స్వామీజీనీ, సారా సీసాల్నీ మార్చిమార్చి చూశాడు. విస్మయంతో మాటరాక గుడ్లప్పగించాడు.

"స్వామీజీ! తమ నిజరూపంకూడా చూస్తే ధన్యులమౌతాం" అంటూ ఇన్ స్పెక్టరు స్వామీజీ గడ్డం చటుక్కున వూడలాగాడు.

"స్వామీ!" కెవ్వున కేకవేశాడు శర్మ. "ఇదంతా ఏమిటి?"

"మిధ్య నాయనా! సర్వం జగన్నాథం!" కళ్ళు మూసుకున్నాడు స్వామీజీ.

శర్మకి ఆశ్చర్యం కన్నా ఎక్కువ దిగులే కలిగింది.

"ఇంకా ఎందుకు బ్రదర్ మీరలా విస్తుబోతారూ? వీడొక పెద్ద దొంగ! జైలునించి తప్పించుకున్నాడు. జగన్నాథుడి వేషం కట్టాడు. బాగా చదువుకున్నవాడు లెండి. అందుకే ఎటూ చెందకుండా అఘోరిస్తున్నాడు."

శర్మకి కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి. "అసలేం చేశారండీ ఈయన?" అన్నాడు రుద్ధకంఠంతో.

"రేపు స్టేషన్‌కి రండి! వీడి కేసు రికార్డు మీ ముందు పెడతాను. చదువుకోండి."

ఇన్‌స్పెక్టరు స్వామీజీకి దారి చూపిస్తూ వెటకారంగా "సుస్వాగతం స్వామీ! దయ చేస్తారా? మీరు లేని జైలు బోసిపోయింది ఇన్నాళ్ళూ!" అన్నాడు.

స్వామీజీ తన్మయత్వంతో "జైలంటే, శ్రీకృష్ణపరమాత్ముడి జన్మస్థలం. అక్కడవున్న పవిత్రత ఇంకెక్కడుంది? పదండి!" అంటూ లేచాడు.

నవ్వులతో విరగబడ్డారు జనం.

ఇన్‌స్పెక్టరు నోట్‌బుక్ తెరుస్తూ శర్మతో "మిష్టర్! మీ అడ్రస్ చెప్పండి" అన్నాడు.

చాలా కంగారుపడ్డాడు శర్మ. "నిజంగా నాకేం తెలీదండీ! నేనలా కొండమీద కూర్చుంటే ...."

"ప్లీజ్! ముందు అడ్రస్ చెప్పండి, రేపు కోర్టులో చెప్పుకుందురుగాని ...."

మారు మాట్లాడకుండా అడ్రస్ చెప్పాడు శర్మ. గడ్డంలేని దొంగస్వామిని చూస్తున్న కొద్దీ పట్టరాని కోపం వచ్చింది శర్మకి. మాటపెగలని అవస్థలో కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాడు.

పోలీసుల మధ్య స్వామీజీ నడిచి వెళ్ళాడు "హరివోం" అంటూనే.

పోలీస్ జీప్ కదిలిపోయింది.

"సార్! బిల్లు!"

తేరుకున్నాడు శర్మ! కిక్కురు మనకుండా కౌంటర్ కేసి నడిచాడు.

['కరుణామయి' మాసపత్రికలో. 1970 కన్నా ముందు కావచ్చు] ★